ఈనాడు నిజామాబాద్

శుక్రవారం సెప్టెంబరు 27, 2024

వేగంగా అర్సపల్లి ఆర్వోబీ నిర్మాణం

నిజామాబాద్ నగర శివారులో అర్సపల్లి రైల్వేగేటు సమీపంలో రూ.135 కోట్లతో రైల్వే పై వంతెన నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. దీని కంటే ముందు మొదలు పెట్టిన చోట నెమ్మదిగా సాగుతుండగా.. ఇక్కడ మాత్రం చకచకా సాగుతుండటంతో వాహనాదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాకేంద్రం నుంచి బోధన్, బాసర, మహారాష్ట్రలకు వెళ్లే వాహనాలు కంఠేశ్వర్ బైపాస్, కొత్త కలెక్టరేట్, అర్సపల్లి రైల్వే గేటు మీదుగా వెళ్తుంటాయి. ఈ సమయంలో గేటు పడితే కిలోమీటర్ల పొడవునా ట్రాఫిక్ స్తంభిస్తోంది. రోజూ 20 సార్లు రైల్వేగేటు వేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.



- ఈనాడు, నిజామాబాద్

మూడు గేట్లెత్తి.. 21,500 క్యూసెక్కులు వదిలి

మహ్మద్‌నగర్, నిజాంసాగర్, న్యూస్‌టుడే: నిజాంసాగర్ జలాశయంలోకి ఎగువ ప్రాంతాల నుంచి 16 వేల క్యూసెక్కుల వరద రావడంతో మూడు గేట్లను ఎత్తి 21,500 క్యూసెక్కుల నీటిని మంజీరా నదిలోకి విడుదల చేసినట్లు ఏఈఈ శివప్రసాద్ తెలిపారు. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు(17.802 టీఎంసీలు) కాగా ప్రస్తుతం నిండుకుండలా మారిందని పేర్కొన్నారు.



28న దిశ సమావేశం

నిజామాబాద్ కలెక్టరేట్ : జిల్లా అభివృద్ధి సమన్వయ మానిటరింగ్ (దిశ) కమిటీ సమావేశం ఈ నెల 28న నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సాయాగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లో ఉదయం 10.30కు ఎంపీ అర్వింద్ అధ్యక్షతన జరిగే సమావేశంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై సమీక్ష ఉంటుందన్నారు.

విద్యుత్తు అంతరాయం నేడు

నిజామాబాద్ అర్బన్ : నగరంలోని ఎల్లమ్మ గుట్ట, ఖలీల్‌వాడి ఫీడర్‌లో మరమ్మతులు ఉన్నందున శుక్రవారం ఉదయం 8 నుంచి 9 వరకు వీక్లీమార్కెట్, నాగేంద్ర గుడి, పూసల గల్లీ, ప్రగతినగర్, పోచమ్మగల్లీ, తిరుమల థియేటర్, చీర్ హనుమాన్ ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేస్తామని నగర ఏడీఈ-2 తోట రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు.

ధ్రువపత్రాల పరిశీలన

నిజామాబాద్ విద్యావిభాగం : కలెక్టరేట్ లోని డీఈవో కార్యాలయంలో శుక్రవారం నుంచి అక్టోబరు 4 వరకు డీఎస్సీ-2008లో 70: 30 శాతంతో నష్టపోయిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని డీఈవో దుర్గాప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. నిజ ధ్రువపత్రాలతో పాటు గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించిన రెండు సెట్ల నకలు పత్రాలతో ఉదయం 10.30కు హాజరు కావాలని సూచించారు. www.schooledu.telangana.gov.in సైట్‌లో అభ్యర్థుల జాబితా అందుబాటులో ఉన్నాయన్నారు.

29న కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశం

నిజామాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశం ఈ నెల 29న నిర్వహిస్తున్నట్లు డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ భవన్‌లో ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. టీపీసీసీ అధ్యక్షుడిగా మహేష్ కుమార్‌గౌడ్ బాధ్యతలు చేపట్టి తొలిసారి అక్టోబరు 4న జిల్లా కేంద్రానికి వస్తున్న నేపథ్యంలో ఘన స్వాగతం పలికేందుకు చర్చించనున్నట్లు వెల్లడించారు.

గైర్హాజరు తగ్గించేలా.. ఉత్తీర్ణత పెంచేలా

ఇంటర్ విద్యార్థుల ఇళ్లకు వెళ్లి అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

న్యూస్‌టుడే, నిజామాబాద్ విద్యావిభాగం

విద్యార్థి జీవితంలో ఇంటర్ చదువు మలుపు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు పక్కా భవనాలున్నాయని, మైదానాలు, అనుభవజ్ఞులైన అధ్యాపకులు బోధిస్తున్నారని, ఉత్తమ ఫలితాలు వస్తున్నాయని ప్రచారం చేసి విద్యార్థులను చేర్పించారు. కానీ, చేరిన విద్యార్థులు చదువు మానేస్తున్నారు. దీనిని నివారించేందుకు విద్యాసంవత్సరం ఆరంభం నుంచే పలు కళాశాలల అధ్యాపకులు చర్యలు తీసుకుంటున్నారు. తరచూ గైర్హాజరవుతున్న వారి ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులను కలిసి అవగాహన కల్పిస్తున్నారు. గైర్హాజరైతే ఇబ్బందవుతుందని, వారి ఆలోచన మార్చి ఉన్నత విద్య వైపు ఆకర్షితులయ్యేందుకు కృషి చేస్తున్నారు.

75 శాతం హాజరు తప్పనిసరి

జిల్లాలో 16 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా.. 7,088 మంది చదువుతున్నారు. కనీసం 75 శాతం హాజరుండాలి. లేదంటే వార్షిక ఫీజు చెల్లించే అవకాశంతో పాటు ఉపకార వేతనాలకు అనర్హులవుతారని తల్లిదండ్రులకు నోటీసులిస్తున్నారు. చదువు ప్రాధాన్యం వివరించి, కళాశాలకు నిత్యం వచ్చేలా చొరవ తీసుకోవాలని చెబుతున్నారు.

మధ్యాహ్న భోజనం అమలుతో ప్రయోజనం

ఇక్కడ గ్రామీణ పేద కుటుంబాల పిల్లలే అధికంగా ఉంటున్నారు. వీరు కళాశాలకు సమయమవుతుందనే హడావుడిలో ఉదయం తినకుండానే వస్తున్నారు. బయట హోటల్‌లో భోజనం చేద్దామంటే ఆర్థిక భారం పడుతోంది. సాయంత్రం వరకు అలాగే ఉండడంతో నీరసించి చదువుపై దృష్టి సారించలేకపోతున్నారు. ప్రభుత్వం ఇంటర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలుచేస్తే సమస్య తీరుతుందని విద్యార్థి సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు. ఇది అమల్లోకి వస్తే హాజరు శాతం మెరుగుపడనుంది.

పాఠ్యాంశాలు అర్థమవ్వాలి..



మాక్లూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులతో మాట్లాడుతున్న డీఐఈవో రవికుమార్

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులు గైర్హాజరు కాకుండా చూసుకోవాలి. అప్పుడే పాఠ్యాంశాలు వారికి అర్థమై ఉత్తీర్ణత శాతం పెరుగుతుంది. **- రవికుమార్, డీఐఈవో**

సర్వే.. మాతో కాదు

- చేతులెత్తేసిన విస్తరణాధికారులు
- కమిషనరేట్‌కు నివేదించిన వ్యవసాయశాఖ

న్యూస్‌టుడే, నిజామాబాద్ వ్యవసాయం

వ్యవసాయశాఖ కొత్తగా చేపడుతున్న డిజిటల్ క్రాప్ సర్వే తమతో సాధ్యం కాదని సిబ్బంది చేతులెత్తేశారు. సర్వే నంబర్ల వారీగా క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలంటే ఇబ్బందులున్నాయని సహాయ నిరాకరణకు దిగారు. తమ సమస్యలు ప్రభుత్వం పట్టించుకోవాలని, పరిష్కరించకుంటే ఈ నెల 27 నుంచి నిరసనకు దిగుతామని జిల్లా వ్యవసాయాధికారికి ఇటీవల వినతిపత్రం సమర్పించారు. చేసేదిలేక డీఏవో సర్వే సామగ్రిని కమిషనరేట్‌కు తిప్పిపంపారు.



జిల్లా వ్యవసాయాధికారికి వినతిపత్రం ఇస్తున్న ఏఈవోలు

పొలం గట్టుకు వెళ్లాలంటే..

ప్రభుత్వం పంట కొనుగోళ్లకు ఎక్కడ? ఎంత విస్తీర్ణంలో వేశారనేది పంట బుకింగ్ సర్వే ద్వారా చూపిస్తున్నారు. గ్రామాల వారీగా క్షేత్రాలను సందర్శించి అక్కడ నుంచి చిత్రం తీసి ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ పని ఏఈవో స్థాయి నుంచి ఏవో, ఏడీఏ, డీఏవో వరకు సర్కారు నిర్దేశించిన లక్ష్యాలకు తగ్గట్లు కానిస్తున్నారు. ఇప్పుడు కొత్తగా డిజిటల్ క్రాప్ సర్వేతో సర్వే నంబర్ల వారీగా నమోదు చేయాల్సి ఉంటుంది. 15 మీటర్ల దూరం దాటితే తీసుకునే పరిస్థితి లేదు. పక్కాగా పొలం దగ్గరికే వెళ్లి వివరాలు నమోదు చేయాలి. ఇందుకు మహిళా సిబ్బంది ఒంటరిగా వెళ్లలేరని ఏఈవోల సంఘం నాయకులు వాపోతున్నారు. ప్రస్తుతం ప్రతి 5 వేల ఎకరాలకు ఒక విస్తరణాధికారి ఉన్నారు. అదే ఆంధ్రప్రదేశ్‌లో వేయి ఎకరాలకు ఒకరిని నియమించారని చెబుతున్నారు. క్షేత్ర సందర్శనకు వెళ్లేప్పుడు ప్రభుత్వం వ్యవసాయ సహాయకులను తోడుగా పంపాలని డిమాండ్ చేస్తున్నారు. ఏఈవోల సాధకబాధకాలు ఉన్నతాధికారులకు నివేదించామని, వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి వాజీద్ హుస్సేన్ పేర్కొన్నారు.

★ వ్యవసాయ డివిజన్లు: 6 ★ క్లస్టర్లు: 108 ★ జిల్లాలో సాగు విస్తీర్ణం: 5,53,550 ఎకరాలు

అటవీ ఆక్రమణ లెక్క తేలేనా?

ఈనాడు, నిజామాబాద్

అటవీ భూములు రక్షించాల్సిన అధికారులే ఆక్రమణలు ప్రోత్సహిస్తున్న ఘటనలు ఆ శాఖకు తలనొప్పిగా మారాయి. ఇటీవల సిరికొండ అటవీ రేంజ్‌లో ఓ అధికారిపై ఫిర్యాదులు వచ్చాయి. ఆక్రమణదారుల నుంచి డబ్బులు తీసుకున్నట్లు అందులో పేర్కొనడంతో ఆయనపై సస్పెన్షన్ వేటు పడింది. తదుపరి విచారణలో అక్రమాలపై నిగ్గు తేల్చాల్సి ఉంది. కానీ, ఈ విషయంలో జాప్యం చర్చకు దారితీస్తోంది. సస్పెన్షన్‌కు గురైన అధికారి ఎవరికి సహకరించాడో తేల్చాలి. కొత్తగా ఎంత విస్తీర్ణంలో ఆక్రమణకు గురైందో గుర్తించాలి. స్వాధీనం చేసుకొని బాధ్యుల పైనా కేసులు పెట్టాలి. కానీ, ఇవేమీ జరగకపోవటంపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఓ రాజకీయ నేత కల్పించుకోవడంతోనే విచారణ నెమ్మదించిందంటున్నారు.

తీవ్ర ఆరోపణలతో ఫిర్యాదులు

సిరికొండ మండలంలో గత నెలలో అటవీ భూముల ఆక్రమణలకు యత్నించారు. వందల చెట్లు నరికేశారు. ఒకచోట టేకు దుంగల డంపు దొరికింది. వరుస ఘటనలకు తోడు స్థానిక అధికారిపై ఆరోపణలు రావడంతో ఆయనపై వేటు వేశారు. మరో అధికారిని ఇక్కడ ఇన్‌ఛార్జిగా నియమించారు. ఫిర్యాదులో డబ్బుల ప్రస్తావన కూడా ఉంది. ఇదంతా అధికారుల చెంతకు చేరింది. వీటిపై సమగ్ర విచారణ చేయించి ఆక్రమణలకు సంబంధించి పూర్తి విషయాలు బయటపెట్టాలి. అక్రమాలైతే బాధ్యులెవరు? సస్పెన్షన్‌కు గురైన అధికారి పాత్ర ఎంత వరకు ఉంది? ఆయనొక్కరే చేశారా? ఇతరుల పాత్ర ఉందా? అనేది తేల్చాల్సి ఉంది.

అధికారి సస్పెన్షన్‌కే పరిమితం

తీవ్రతను తగ్గించారా?

అటవీ భూముల ఆక్రమణను ఆ శాఖ సహించదు. బాధ్యులపై కఠినంగానే వ్యవహరిస్తారు. తాజాగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎఫ్‌డీవో విషయంలో తీసుకున్న చర్యలే ఇందుకు ఉదాహరణ. సిరికొండ వ్యవహారంలో మొదట్లో ఇదే తరహా స్పందించినట్లు కనిపించినా.. తర్వాత విచారణలో జాప్యం నెలకొంది. అధికారుల వద్ద ఉన్న మ్యాప్‌ల ఆధారంగా ఆక్రమణకు గురైన ప్రదేశాన్ని వెంటనే గుర్తించొచ్చు. సాంకేతిక పరిజ్ఞానంతో కొత్తగా నరికివేతకు గురైన ప్రాంతాన్ని నిర్ధారించొచ్చు. ఆరోపణలపై క్షేత్రస్థాయి విచారణ చేపడితే మరిన్ని ఆధారాలు లభించే అవకాశం ఉంది. ఆక్రమణ చేసినట్లు తేలితే నిందితులపై కేసులు పెట్టాలి. కానీ ఇక్కడ శాఖ పరంగా తీసుకున్న చర్యలు చూస్తే.. తీవ్రత తగ్గించినట్లేనని స్పష్టమవుతోంది. ఉమ్మడి జిల్లా నేత ఈ వ్యవహారంలో కలుగజేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది.

ఎక్కడి చెత్త అక్కడే

బల్దియాల్లో పట్టని పారిశుద్ధ్యం

పరిశీలన

ఓ వైపు స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాలు నిర్వహిస్తుంటే.. మరోవైపు కాలనీల్లో పారిశుద్ధ్యం కొరవడుతోంది. వీధుల్లో పేరుకుపోయిన చెత్త తొలగించడం లేదు. కాలనీలకు వాహనాలు రాకపోవడంతో రోజుల తరబడి ఇంట్లో వ్యర్థాలు నిల్వ చేయలేక కొందరు బహిరంగ ప్రదేశాల్లో విసిరేస్తున్నారు. అధికారులు కారణాలు ఎన్ని చెప్పినా పట్టణాలు, నగరాల శోభను చాటేది పరిశుభ్రమైన పరిసరాలే. వాతావరణ మార్పుల్లో ఉష్ణోగ్రతలు, వానలు ఏకకాలంలో దాడి చేస్తుండటంతో అపరిశుద్ధ్యం ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోంది. ఉమ్మడి జిల్లాలో నిజామాబాద్ నగరపాలక సంస్థతో పాటు బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్, కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ బల్దియాలు ఉన్నాయి. వీటి పరిధిలో నిత్యం 500 మె.ట చెత్త వెలువడుతుందని అంచనా.



కంచెల ఏర్పాటు

నిజామాబాద్ సర్కిల్1లో ఆదర్శనగర్‌లో చెత్త వేస్తున్న ప్రాంతాలు గుర్తించి కంచె ఏర్పాటు చేశారు. ఇక్కడ దయచేసి చెత్తవేయొద్దని ఫ్లెక్సీలు పెట్టారు. - **న్యూస్‌టుడే, నిజామాబాద్ నగరం**

సేకరణలో జాప్యం


బోధన్‌లో కూడళ్లలో చెత్త నిల్వలు పేరుకుపోతున్నాయి. ఇంటింటి చెత్త సేకరణకు వినియోగించే 14 వాహనాల్లో సాంకేతిక సమస్యలతో నిలిచిపోయాయి. వీటి స్థానంలో పనిచేసే వాటినే అదనపు ట్రిప్పులు తిప్పుతున్నా సేకరణలో జాప్యమవుతోంది. స్థానికులు ఒకరోజు దాటితే కూడళ్ల వద్ద చెత్త డంప్ చేస్తున్నారు. పట్టణంలో నిత్యం ఉత్పత్తయ్యే 34 మె.ట చెత్తలో 32 మె.ట సేకరిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. వాహనం ఆలస్యమైతే ఇంట్లో నిల్వ చేయాలని కోరుతున్నట్లు పారిశుద్ధ్య అధికారులు తెలిపారు.
- న్యూస్‌టుడే, బోధన్



మూడు నెలలుగా..

బాన్సువాడ పట్టణం శ్రీరామకాలనీ అయ్యప్ప మందిరం వెనుక మూడు నెలలుగా చెత్త నిల్వలు ఉంటున్నాయని స్థానికులు తెలిపారు. పర్యావరణ ఇంజినీర్ హన్మాండ్లును వివరణ కోరగా ఇప్పటికి పలుమార్లు నిల్వలు తొలగించామని, రోడ్ల మీద వేయొద్దని కోరారు. నిత్యం 12 మె.ట. చెత్త ఉత్పత్తవుతోంది.
- న్యూస్‌టుడే, బాన్సువాడ పట్టణం





బస్టాండు ఆవరణ అపరిశుభ్రం

ఆర్మూర్ పట్టణంలో ఖాళీ స్థలాలు, ఓపెన్ ప్లాట్లతో చెత్త నిల్వలు పేరుకుంటున్నాయి. బస్టాండు ఆవరణలో కొందరు పాలిథిన్ వ్యర్థాలు, చెత్త పారేసి అక్కడే కాల్చేస్తున్నారు. రెండు రోజులకు ఓసారి చెత్తబండి రావడంతో చెత్త స్థానికులు ఖాళీ స్థలాల్లో పడేస్తున్నారు. నిత్యం 30 మె.ట. ఉత్పత్తవుతున్నా వాహనాల కొరతతో 25.మె.ట. మాత్రమే సేకరిస్తున్నారు. **- ఆర్మూర్ పట్టణం**

ఇక్కడ ఆదర్శం..

నిజామాబాద్ జిల్లాకేంద్రం దుబ్బ ప్రాంతంలో నగరపాలక సంస్థ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పక్కాగా చెత్త సేకరిస్తున్నారు. నిత్యం సర్కిల్-1 నుంచి సుమారు 45 నుంచి 50 మె.ట చెత్త సేకరిస్తున్నారు.
- న్యూస్‌టుడే, నిజామాబాద్ నగరం



రాత్రి వేళల్లో..



నిజామాబాద నగరం ఆదర్శ నగర్ విశ్వ హిందూ పరిషత్ కార్యాలయం పక్క రోడ్డులో వేసిన చెత్త ఇది. కొందరు వ్యక్తులు రాత్రి, తెల్లవారుజామున రోడ్లపైనే పారబోస్తున్నారు. నిత్యం కనీసం 20 మె.ట వరకు చెత్త రోడ్ల పక్కన పేరుకుపోతోంది. **- నిజామాబాద్ నగరం**

కూడళ్లు, మురుగుకాల్వల్లో..

కామారెడ్డి పట్టణం అశోక్‌నగర్ సమీపంలో ఆర్టీసీ కాలనీ దుస్థితి ఇది. జిల్లాకేంద్రంలో నిత్యం 80 మె.ట చెత్త ఉత్పత్తి అవుతోంది. 55 నుంచి 60 శాతం డంపింగ్‌యార్డుకు తరలుతోంది. మిగతాది చెత్తను కూడళ్లు, మురుగు కాల్వల్లో పారేస్తున్నారు.
న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం



తొలగించడం మరిచారు

భీమ్‌గల్ పట్టణంలో కేసీఆర్‌కాలనీ ఏర్పడి ఏడాదవుతున్నా బల్దియాకు సంబంధించిన చెత్త తరలించే వాహనాలు కాలనీవైపు రాలేదు. బల్దియాలో 7 చెత్త వాహనాలు, 43 మంది పారిశుద్ధ్య కార్మికులున్నారు. చెత్త సేకరించకపోవడంతో ప్రజలు ప్రధాన రహదారిపైనే వేస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ రామకృష్ణను వివరణ కోరగా.. 'కేసీఆర్ కాలనీని ఇది వరకు మున్సిపల్ పరిధిలో చేర్చలేదు. కాలనీని మున్సిపల్ పరిధిలోకి వచ్చేలా ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం. సిబ్బంది పంపి వెంటనే తొలగించేలా చర్యలు తీసుకుంటాం' అని చెప్పారు.
- న్యూస్‌టుడే, భీమ్‌గల్



వివాహిత ఆత్మహత్యాయత్నం

నిజామాబాద్ నేరవిభాగం: నిజామాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలోని పట్టాలపై వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం.. మాచారెడ్డికి చెందిన మహిళకు ఐదేళ్ల కిందట బాన్సువాడకు చెందిన వ్యక్తితో వివాహం అయ్యింది. కొంత కాలంగా భర్త వేధింపులకు పాల్పడుతున్నాడని, వేధింపులు తాలలేక వివాహిత తండ్రికి చరవాణిలో సంప్రదించి ఆత్మహత్య చేసుకుంటానని చెప్పింది. తండ్రి వెంటనే బాన్సువాడ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు సాంకేతికత ఆధారంగా ఆమె నిజామాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే రైల్వే ఠాణా ఎస్సై సాయిరెడ్డికి సమాచారం అందించగా.. సిబ్బందితో వెళ్లి ఆమెను కాపాడి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

విద్యార్థిని చరవాణికి సందేశం..

- ఉపాధ్యాయుడిపై చేయిచేసుకున్న తల్లిదండ్రులు

మోపాల్: విద్యార్థిని తండ్రి చరవాణికి ఉపాధ్యాయుడు సందేశాలు పంపడం వివాదానికి దారి తీసింది. ఈ ఘటన మోపాల్ మండలంలో చోటుచేసుకుంది. ఓ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు విద్యార్థినికి చెప్పాల్సిన విషయం రాత్రివేళ ఆమె తండ్రి చరవాణికి పంపారు. దీనిపై అభ్యంతరం తెలుపుతూ.. తల్లిదండ్రులు మూడు రోజుల క్రితం ప్రధానోపాధ్యాయురాలికి ఫిర్యాదు చేశారు. సెలవులో ఉన్న సదరు ఉపాధ్యాయుడు గురువారం విధులకు రావడంతో విద్యార్థిని తల్లిదండ్రులు, బంధువులు వెళ్లి ఆయనపై చేయిచేసుకున్నారు. స్థానికులు డయల్ 100కు ఫోన్ చేయడంతో పోలీసులు వచ్చి ఇరువర్గాలను ఠాణాకు పిలిపించగా.. వారు రాజీ కుదుర్చుకొని ఫిర్యాదు ఇవ్వకుండా వెళ్లిపోయినట్లు పోలీసులు తెలిపారు. సదరు ఉపాధ్యాయుడికి ప్రధానోపాధ్యాయురాలు మెమో ఇచ్చినట్లు తెలిసింది.



సదస్సులో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

పరిశోధనలపై దృష్టి

భిక్కనూరు, న్యూస్‌టుడే: విద్యార్థి దశలోనే పరిశోధనలపై దృష్టి సారించాలని జువాలజీ సర్వే ఆఫ్ ఇండియా శాస్త్రవేత్త డా.కరుత పాండి సూచించారు. గురువారం తెవివి దక్షిణ ప్రాంగణంలో జువాలజీ విభాగంలో జాతీయ సదస్సు నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ.. డీఎన్‌ఏ బార్ కోడింగ్, జువాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా శాఖల గురించి వివరించారు. జంతుశాస్త్ర విభాగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలన్నారు. ఉస్మానియా వర్సిటీ జెనిటిక్స్ విభాగం సహాయ ఆచార్యురాలు సంధ్య, జువాలజికల్ సొసైటీ శాస్త్రవేత్త సోమేష్ బెనర్జీ, శివశంకర్, ప్రిన్సిపల్ సుధాకర్‌గౌడ్ ప్రసంగించారు. క్విజ్ విజేతలకు బహుమతులు అందించారు. విభాగాధిపతి ప్రసన్నశీల, అధ్యాపకులు సునీల్‌కుమార్, విజయ్‌కుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

తెవివిలో సహాయ కేంద్రం

తెవివి క్యాంపస్(డిచ్‌పల్లి గ్రామీణం): ఏబీవీపీ తెలంగాణ వర్సిటీ శాఖ ఆధ్వర్యంలో ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వద్ద ఎంబీఏ, ఎంసీఏలో ప్రవేశాలు పొందుతున్న విద్యార్థుల కోసం సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. జాతీయ కార్యవర్గ సభ్యులు శివ, రాష్ట్ర కమిటీ సభ్యులు నాగరాజు, వర్సిటీ కార్యదర్శి అమృత్‌చారి, నాయకులున్నారు.

కళాశాల ప్రగతికి కదిలిరా!

- గిరిరాజ్‌లో రేపు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

న్యూస్‌టుడే, నిజామాబాద్ విద్యావిభాగం, సుభాష్‌నగర్

ఓ వ్యాపారవేత్త ఆర్థికసాయంతో ఏర్పాటైన గిరిరాజ్ కళాశాల ఎందరో విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపింది. ఇక్కడ చదివిన వారు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్, పలు విశ్వవిద్యాలయాలకు ఉపకులపతులుగా ఎదిగారు. 68 ఏళ్లలో మినీ యూనివర్సిటీ స్థాయికి చేరి.. మరోసారి న్యాక్ గుర్తింపునకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో కళాశాల వృద్ధిలో పూర్వ విద్యార్థుల భాగస్వామ్యం కోరుతూ ఈ నెల 28న సమ్మేళనం ఏర్పాటు చేశారు.



కళాశాలలో పూర్వ విద్యార్థులు నిర్మించిన పార్కింగ్ షెడ్డు

ఎలా ఏర్పాటైందంటే?

నిజాం పాలన నుంచి విముక్తి పొందాక జిల్లా అభివృద్ధిలో చదువే కీలకపాత్ర పోషిస్తుందని ఇందూరు నేతలు భావించారు. కళాశాల ఏర్పాటుకు హన్మంత్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేసి నిధుల కోసం కృషి చేశారు. 1956లో అప్పటి కలెక్టర్ సి.కే. మూర్తి కళాశాల ఏర్పాటుకు రూ.50 వేలు మంజూరు చేయగా.. ప్రముఖ వ్యాపారవేత్త గిరిరాజ్ మల్‌జీ అగర్వాల్ రూ.51 వేలు అందజేశారు. అందుకు కృతజ్ఞతగా దాత గిరిరాజ్ పేరుతో కళాశాలను ప్రారంభించారు.

అలుమ్ని కమిటీ స్థాపన

పూర్వ విద్యార్థుల్ని ఒకే వేదికపైకి తీసుకొచ్చి కళాశాల అభివృద్ధిలో భాగస్వామ్యం చేసేందుకు 2018 సెప్టెంబరు 15న అలుమ్ని అసోసియేషన్ పేరుతో పూర్వ విద్యార్థుల సంఘం స్థాపించారు. విదేశాల్లోని వారు సైతం చేరేందుకు ఆన్‌లైన్ సేవల్ని విస్తరించారు.

ఇప్పటివరకు చేపట్టిన పనులు

- కళాశాలలో పార్కింగ్ సమస్య ఉండటంతో రూ.2 లక్షలతో షెడ్డు నిర్మించారు.
- ఈ కళాశాలలో చదివి ఇక్కడే అధ్యాపకులుగా సేవలందిస్తున్నవారు విరాళాలు సేకరించి రూ.3 లక్షలతో ప్రాంగణంలో రక్షణ కంచె నిర్మించి మొక్కలు నాటించారు.
- 1975-78, 1978-81 బ్యాచ్‌ల విద్యార్థులు రూ.5.5 లక్షలతో కొత్తగా పార్కింగ్ షెడ్డు నిర్మించారు. మాజీ మంత్రి మండవ ఇటీవల దీనిని ప్రారంభించారు.

విజయవంతం చేయాలి

కళాశాల అభివృద్ధికి శనివారం సమ్మేళనం నిర్వహిస్తున్నామని, 1956 నుంచి 2023 వరకు చదివిన డిగ్రీ, పీజీ విద్యార్థులు హాజరై విజయవంతం చేయాలని ప్రిన్సిపల్ రామ్మోహన్‌రెడ్డి, అలుమ్ని కమిటీ సమన్వయకర్త దండు స్వామి కోరారు. వివరాలకు 9440791144 నంబరులో సంప్రదించాలని సూచించారు

విజ్ఞానం వికసించేలా

- 28న సైన్స్ డ్రామా ఫెస్ట్

న్యూస్‌టుడే, బాన్సువాడ పట్టణం

మారుతున్న పోటీ ప్రపంచానికి అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతన కార్యాచరణకు నడుం బిగించాయి. విజ్ఞాన శాస్త్రంలో ఎన్‌సీఈఆర్‌టీ, ఎస్‌ఈఆర్టీ సమన్వయంతో ఈ నెల 28న నాటక పోటీలు సౌతరన్ ఇండియా సైన్స్ డ్రామా ఫెస్ట్(ఎస్ఐఎస్‌డీఎఫ్) చేపట్టనున్న నేపథ్యంలో కథనం

ఆసక్తి పెంచేలా.. ప్రపంచ నీటి ఎద్దడి, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సమాజం, విపత్తుల నిర్వహణకు ఆధునిక సాంకేతికత, ఆరోగ్యం పరిశుభ్రత, వాతావరణ మార్పు, దాని ప్రభావం అనే ఐదు అంశాల్లో ఏదో ఒక దాన్ని ఎంచుకుని దానిపై నాటకం ప్రదర్శించాలి. దీనికి 100 మార్కులు కేటాయించారు. ప్రదర్శనకు 50, సాంకేతికతకు 30, ఉత్తమ ప్రదర్శన తీరునకు 20 ఇవ్వనున్నారు. 30 నిమిషాల్లో డ్రామాను పూర్తి చేయాలి. ప్రదర్శించే బృందంలో ఒక డైరెక్టర్, స్క్రిప్ట్ రచయితతో పాటు 10 మంది మించకూడదు. ఈ నెల 28న కామారెడ్డి జిల్లాకేంద్రంలోని శాంతినికేతన్ పాఠశాలలో ఉదయం 10 గంటలకు కార్యక్రమం నిర్వహించనున్నారు.



ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారితో డీఈవో, జిల్లా సైన్స్ అధికారి(పాత చిత్రం)

సద్వినియోగం చేసుకోవాలి

సిద్దిరాంరెడ్డి, జిల్లా సైన్స్ అధికారి

జిల్లాలోని ప్రతి పాఠశాలలోని 8 నుంచి 10వ తరగతిలోని ఆసక్తి ఉన్న విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు సిద్ధం చేయాలి. శాస్త్ర సాంకేతికతలను డ్రామా రూపంలో ప్రదర్శించాలి. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి రాష్ట్ర, జాతీయ స్థాయిలో సైతం మంచి గుర్తింపు ఉంటుంది.. సద్వినియోగం చేసుకోవాలి.

రుణమాఫీపై కోర్టును ఆశ్రయించాలని తీర్మానం

నిజామాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: పాల్దా సొసైటీలో తాము తీసుకున్న రుణాలు మాఫీ కాకపోవడంతో రైతులు కోర్టును ఆశ్రయించాలని తీర్మానించారు. గురువారం సొసైటీలో మహాజన సభ నిర్వహించగా.. కొండూరు, తిర్మన్‌పల్లి, పాల్దా రైతులు హాజరై సంఘ సభ్యులను మాఫీపై నిలదీశారు. తీసుకున్న రుణం కంటే ఎక్కువ నమోదు కావడంతో 138 మందికి మాఫీ వర్తించలేదని వాపోయారు. ఛైర్మన్ కౌలాస్ శ్రీనివాస్, సభ్యులు కల్పించుకొని సొసైటీ తప్పిదంతో మాఫీ కాలేదని వివరించారు. డీసీసీబీ బ్యాంకులో వివరాలు తప్పుగా నమోదు చేసి నివేదిక పంపడంతోనే వర్తించలేదని కొందరు రైతులు ఆరోపించారు. ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు తమ గోడు విన్నవించినా ఫలితం లేకపోవడంతో.. సొసైటీ వారు కోర్టును ఆశ్రయించి తమకు న్యాయం జరిగేలా పోరాడాలని డిమాండ్ చేశారు. సంఘం సభ్యులు తాము కూడా మద్దతు ఇచ్చి సహకారం అందిస్తామని, వారంలోగా కోర్టులో కేసు వేయాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. సొసైటీ సభ్యులు గాడి జితేందర్, మాధవరెడ్డి, నర్సయ్య తదితరులున్నారు.



సమావేశమైన సంఘం సభ్యులు, రైతులు

రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారిణులు

నిజామాబాద్ క్రీడావిభాగం: నిజామాబాద్ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో గురువారం బాలబాలికల ఉమ్మడి జిల్లాస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. వీరు వచ్చే నెల 4, 5, 6 తేదీల్లో కామారెడ్డిలో నిర్వహించే టోర్నీలో పాల్గొంటారు. వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు విద్యాసాగర్‌రెడ్డి, జిల్లా నెట్‌బాల్ కార్యనిర్వాహక అధ్యక్షుడు రవి, పీడీ రాము, జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

నేడు మిట్టపల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో..

నిజామాబాద్ క్రీడావిభాగం: మిట్టపల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో నిజామాబాద్ పాఠశాలలో శుక్రవారం నెట్‌బాల్ లీగ్, నాక్ ఔట్ టోర్నీ నిర్వహించనున్నామని సంఘం కార్యదర్శి జిల్లా రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. బాలబాలికల జట్లు పాల్గొంటాయని, ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఆదిలాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. వివరాలకు 94400 07004, 6281705645 నంబర్లలో సంప్రదించాలన్నారు.

జాతీయస్థాయికి ఎంపిక

నిజామాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఇటీవల రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ చాటిన కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డికి చెందిన క్రీడాకారుడు గణేశ్ జాతీయ పోటీలకు ఎంపికైనట్లు నిజామాబాద్ జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి పింజ సురేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 3న హైదరాబాద్‌లో నిర్వహించే సబ్‌జూనియర్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

28న ఫుట్‌బాల్, రెజ్లింగ్..

నిజామాబాద్ క్రీడావిభాగం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 28న బాలబాలికలకు రాజారాం స్టేడియంలో అండర్-17 ఫుట్‌బాల్, జడ్పీహెచ్ఎస్(మంచిప్ప)లో అండర్-14, 17 రెజ్లింగ్ ఎంపిక పోటీలు చేపడుతున్నట్లు కార్యదర్శి నాగమణి ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ఇందులో పాల్గొనాలని పేర్కొన్నారు. వివరాలకు 7893732228, 9550358444 నంబర్లలో సంప్రదించాలన్నారు.

30న విలువిద్య, స్కేటింగ్

నిజామాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బాలబాలికలకు ఈ నెల 30న నగరంలోని రాజారాం స్టేడియంలో అండర్-14, 17 విలువిద్య, డీఎస్ఏ స్విమ్మింగ్ పూల్‌లో అండర్-11, 14, 17 స్కేటింగ్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నామని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నాగమణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు చరవాణి నెంబర్లు 70369 15136, 83339 47957లలో సంప్రదించాలని పేర్కొన్నారు.



ముగిసిన పోటీలు

జక్రాన్‌పల్లి, న్యూస్‌టుడే: ఏడేళ్ల తర్వాత నిర్వహించిన జక్రాన్‌పల్లి మండలస్థాయి అంతర్ పాఠశాలల క్రీడా పోటీలు గురువారంతో ముగిశాయి. జక్రాన్‌పల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో దాతల సాయంతో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలు సబ్ జూనియర్, జూనియర్ విభాగాల్లో నిర్వహించారు. గెలిచిన జట్లకు షీల్డులు, ట్రోఫీలు ప్రదానం చేశారు. అనంతరం గ్రామంలో విజయోత్సవ ర్యాలీ చేపట్టారు.

ఉమ్మడి జిల్లా యోగా సాధకులకు..

కామారెడ్డి క్రీడావిభాగం, న్యూస్‌టుడే: కామారెడ్డి యోగా భవన్‌లో గురువారం ఉమ్మడి జిల్లాకు సంబంధించి క్రీడాకారుల యోగా ఎంపికలు పూర్తయ్యాయి. అండర్-17 బాలుర విభాగంలో సందీప్(కామారెడ్డి), తరుణ్(నిజామాబాద్), వీరుపక్ష్(నిజామాబాద్) విజయం సాధించారు. బాలికల నుంచి సోనా(కామారెడ్డి), సరస్వతి(కామారెడ్డి), త్రివేణి(నిజామాబాద్) గెలుపొందారు. అండర్-14 బాలుర విభాగం నుంచి సాయిచరణ్(నిజామాబాద్), హర్షవర్ధన్(కామారెడ్డి), సృజన్(నిజామాబాద్) ఎంపికయ్యారు. బాలికల నుంచి సింధూజ(కామారెడ్డి), జ్యోత్స్న (కామారెడ్డి), సుమైత్రికా(నిజామాబాద్) విజయం సాధించారు. డీఈవో రాజు, యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి, ఎస్‌జీఎఫ్ కన్వీనర్ హీరాలాల్ పాల్గొన్నారు.

కళ్లలో కారం చల్లి.. కర్రలతో దాడి..

- పక్కా ప్రణాళికతో దారుణ హత్య

మోపాల్, న్యూస్‌టుడే: తన కూతురు బలవన్మరణాన్ని జీర్ణించుకోలేని తండ్రి ఆమె అత్తగారి కుటుంబంపై కక్ష పెంచుకున్నారు. పక్కా ప్రణాళికతో బుధవారం రాత్రి ఇంటిపై దాడి చేసి గాజ నరహరి(58) కళ్లలో కారం పొడి చల్లి కర్రలతో కొట్టి హతమార్చిన ఘటన మోపాల్ మండలం కంజరలో చోటు చేసుకుంది. ఎస్‌హెచ్‌వో యాదగిరిగౌడ్ కథనం ప్రకారం.. బోయిని సత్యనారాయణ కుమార్తె వర్షను అదే గ్రామానికి చెందిన నరహరి చిన్న కొడుకు గోవర్ధన్‌కు వచ్చి వివాహం చేశారు. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మూడు నెలల క్రితం వర్ష పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. దీంతో భర్త గోవర్ధన్ 40 రోజులు జైలుకెళ్లి ఇటీవలే బయటకు వచ్చారు. వర్ష తండ్రి సత్యనారాయణ తన కుమార్తె పిల్లల పేరుపై ఆస్తులు రాయాలని పంచాయితీ పెట్టించారు. దీనిపై ఇరు కుటుంబాలకు ఒప్పందం కుదరకపోవడంతో బుధవారం రాత్రి నరహరి కుటుంబంపై దాడి చేశారు. రక్షించేందుకు అడ్డుగా వెళ్లిన ఆయన భార్య స్వరూప, పెద్ద కొడుకు గోపి(32)ని గాయపరిచారు. భార్య, కుమారుడు ఇంట్లోకెళ్లి గడియ పెట్టుకొని డయల్ 100కు సమాచారం అందించారు. పోలీసులు వెళ్లేలోపే నిందితులు పారిపోయారు. ఆ సమయంలో గోవర్ధన్ లేకపోవడంతో ప్రాణాలు దక్కించుకున్నారు. బుధవారం రాత్రి ఘటనా స్థలానికి చేరుకున్న ఏసీపీ రాజవెంకట్‌రెడ్డి, సీఐ సురేష్‌కుమార్, ఎస్‌హెచ్‌వో యాదగిరిగౌడ్ గొడవను అదుపుచేశారు. బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు బోయిని సత్యనారాయణ, లలిత, పూజిత, బాలకృష్ణ, వంశీ, సందీప్, మహేష్, రవితో పాటు మరికొందరిపై కేసు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.



గాజ నరహరి

పోలీసుల కస్టడీలో 8 మంది: నరహరిని చంపిన వారిని అరెస్టు చేసే వరకు అంత్యక్రియలు నిర్వహించమని మృతుడి కుటుంబీకులు భీష్మించడంతో ఏసీపీ, సీఐ బాధితులతో మాట్లాడి సముదాయించారు. 8 మంది కస్టడీలో ఉన్నారని చెప్పడంతో గురువారం సాయంత్రం అంత్యక్రియలు పూర్తిచేశారు.



మృతుడి కుటుంబ సభ్యులను సముదాయిస్తున్న సీఐ సురేష్‌కుమార్

నిజామాబాద్

• నిజామాబాద్ అర్బన్ • నిజామాబాద్ రూరల్ • బోధన్ • బాన్సువాడ

తాహెర్ బిన్ హందాన్‌కు సన్మానం



నిజామాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: కర్ణాటకలో అక్కడి రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ మహమ్మద్ అలీ ఖాజీ నేతృత్వంలో ఉర్దూ భాషాభివృద్ధిపై గురువారం సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్ సమావేశానికి వెళ్లగా ఆయన్ను స్థానికులు సన్మానించారు.

బకాయిల విడుదలకు భారీ ర్యాలీ

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్(యూఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో గురువారం పాత కలెక్టర్ కార్యాలయం నుంచి ధర్నా చౌక్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, పెద్ది సూరి, నగర కార్యదర్శి మహేష్ ఉన్నారు.



ఈనాడు సినిమాలు

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏసియన్)
స్క్రీన్-1: దేవర పార్ట్-I 8.10, 11.140, 3.10, 6.40, 10.10(రాత్రి)
పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణుమాల్)
స్క్రీన్-1: దేవర పార్ట్-I 7.40, 11.15, 2.50, 6.25, 10.00(రాత్రి) స్క్రీన్-2: మత్తు వదలరా-2 12.30, 3.30, 6.00, 9.00(రాత్రి)
స్క్రీన్-3: దేవర పార్ట్-I 8.40, 12.15, 3.50, 7.25, 11.00(రాత్రి) స్క్రీన్-4: తుంబర్డ్ (హిందీ) 1.25, 4.05 స్త్రీట్-2 (హిందీ) 7.20, 10.00(రాత్రి)
దేవి (ఎస్వీసీ): మత్తు వదలరా-2 10.50, 2.15, 6.00, 9.30రాత్రి)
నటరాజ్(గీతా ఏసియన్): దేవర పార్ట్-I (హిందీ) 11.00, 2.30, 6.00, 9.30(రాత్రి)
లలితామహల్(ఎస్వీసీ): దేవర పార్ట్-I 11.00, 2.15, 6.00, 9.15(రాత్రి)
విజయ్(ఎస్వీసీ): దేవర పార్ట్-I 10.50, 2.20, 6.00, 9.40(రాత్రి)

న్యూస్‌టుడే, నిజామాబాద్ సాంస్కృతికం

పరిష్కరిస్తేనే ప్రాణాలు నిలుస్తాయ్..



న్యూస్‌టుడే, ఇందల్‌వాయి

గన్నారం నుంచి 44వ జాతీయ రహదారిపైకి వెళ్లే క్రమంలో సోమవారం ఉదయం ద్విచక్రవాహనంపై ఆసుపత్రికి వెళ్తున్న వృద్ధ దంపతులను కంటెయినర్ ఢీకొట్టింది. గంగవ్వ(68) మృతి చెందగా.. ఆమె భర్త మల్లయ్య కాలు నుజ్జునుజ్జు అయింది. గతంలోనూ అనేక ప్రమాదాలు జరిగి పదుల సంఖ్యలో మృత్యువాత పడ్డారు.

పనులు ప్రారంభించినా..

ఏడాది కిందట గ్రామానికి చెందిన కంఠం సాయిలు ప్రమాదంలో మృతి చెందగా.. గ్రామస్థులు రోడ్డుపై బైఠాయించి నిరసనలు తెలిపారు. పోలీసులు సమస్యను పీడీ దృష్టికి తీసుకెళ్లి గన్నారం ముఖద్వారం సమీపంలో వరద వంతెన ఉందని, దానికి ఇరువైపులా సర్వీసు రోడ్లు ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో పనులు ప్రారంభించారు. వర్షాలు రావడంతో పనులు ఆగిపోయాయి. ప్రస్తుతం దాని ఊసెత్తడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు.

గన్నారం నుంచి 44వ జాతీయ రహదారిపైకి వచ్చే మలుపు



రాకపోకలతో రద్దీగా..

గన్నారం, మేగ్యానాయక్‌తండా, స్టేషన్ తండా, సిర్నాపల్లి, నల్లవెల్లి గ్రామాల ప్రజలకు ఇదే ప్రధాన రహదారి. ఈ మలుపు నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. దీనికి తోడు 44వ జాతీయ రహదారిపై వాహనాలు అధిక వేగంతో ప్రయాణిస్తుంటాయి. ప్రతి సోమవారం ఇక్కడ వారసంత ఉండడంతో ప్రమాదాలు మరింత అధికమవుతున్నాయి.



వరద కోసం ఏర్పాటు చేసిన వంతెన

• మరోసారి తెరపైకి గన్నారం సర్వీసు రోడ్డు ఏర్పాటు

అండర్‌పాస్‌తోనే సమస్య తీరుతుంది..

- వీరబాబు, రహదారి నిర్వహణ మేనేజర్, ఇందల్‌వాయి టోల్‌ప్లాజా

అండర్‌పాస్ వంతెనతోనే సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. జాతీయ రహదారుల అధికార సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) మంజూరు చేయాల్సి ఉంటుంది. పోలీసుశాఖ గన్నారం ముఖద్వారం వద్ద బ్లాక్ స్పాట్‌గా గుర్తించనుంది. ప్రస్తుతానికి అక్కడ వాహనాలు నెమ్మదిగా వెళ్లేలా బారికేడ్లు ఏర్పాటు చేశాం.

ఆకట్టుకున్న సైన్స్ మేళా

నిజామాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: జిల్లా యువజన, క్రీడాశాఖ ఆధ్వర్యంలో గురువారం శంకర్‌భవన్ పాఠశాలలో జిల్లాస్థాయి సైన్స్‌మేళా నిర్వహించారు. విజేతలకు ఈ నెల 27న కొత్త అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించే 28వ జాతీయ యువజన ఉత్సవాల్లో బహుమతులు అందిస్తామని డీవైఎస్‌వో ముత్తన్న తెలిపారు. ఎన్‌వైకే యువజన అధికారిణి శైలీబెల్లాల్, జిల్లా సైన్స్ అధికారి గంగాకిషన్, డీవైఎస్‌వో కార్యాలయ సిబ్బంది ప్రశాంత్, మహిపాల్‌రెడ్డి, గంగాదాస్, సురేశ్ పాల్గొన్నారు.



ప్రాజెక్టులు చూస్తున్న డీవైఎస్‌వో ముత్తన్న, ఎన్‌వైకే యువజన అధికారిణి శైలీబెల్లాల్, సైన్స్ అధికారి గంగాకిషన్

అక్రమ నిర్మాణాలతో నగరం జలమయం

నిజామాబాద్ నగరం, న్యూస్‌టుడే: అక్రమ నిర్మాణాలు, నాలాలు కబ్జా కావడంతో నగరం చిన్నపాటి వర్షానికే జలమయం అవుతున్నాయని వినియోగదారుల సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు సాంబరాజు చక్రపాణి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆనంద్‌నగర్, వర్నిరోడ్, సరస్వతినగర్ తదితర కాలనీలు అక్రమ కట్టడాలను ఆయన పరిశీలించారు. ఇందూరు సంక్షేమ సమితి ఉపాధ్యక్షుడు వర్మ, ప్రధాన కార్యదర్శి సందు ప్రవీణ్ తదితరులు ఉన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న వినియోగదారుల సంక్షేమ సమితి

మేమున్నాం.. మీకు తోడుగా..

94408 85670
80085 74007
98850 93048

● సమస్య: మహాలక్ష్మీనగర్-2 రోడ్డు నంబరు-1లో చివరి ఇళ్ల వరకు చెత్త సేకరణ వాహనం రాక చెత్త బయట వేస్తున్నాం. - శశి, కాలనీవాసి

● సమాధానం: రిక్షా పంపించి సమస్య పరిష్కరిస్తాం. - సునీల్, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు, జోన్-2

● బోధన్ జలాల్‌బుకారీ దర్గా వెనక వీధిలో రహదారి వెంట వ్యర్థాలు పేరుకున్నాయి. - సాయిలు, బోధన్



● విషయాన్ని శానిటరీ జవాన్ గంగారాం దృష్టికి తీసుకెళ్లగా పరిష్కరింపజేశారు.

● వడ్డేపల్లిలో దోమల బెడద అధికంగా ఉంది. - గ్రామస్థుడు, వడ్డేపల్లి

● నివారణ చర్యలు చేపడుతున్నాం. - రమేష్, పంచాయతీ కార్యదర్శి, వడ్డేపల్లి

● రుద్రూర్‌లోని వంజరి గల్లీలో బోరు బావి చెడిపోయి సంవత్సరం అయింది. ఇబ్బందులు పడుతున్నాం - గణేష్, రైతు, రుద్రూర్

● సమస్య పరిష్కారానికి కృషి చేస్తా - సురేష్‌బాబు, ఎంపీడీవో, రుద్రూర్

● తిర్మన్‌పల్లి గ్రామంలోని రాజీవ్ కాలనీలో మిషన్ భగీరథ నీరు సరిగ్గా రావడం లేదు. రెండు బిందెల నీటితో నానా అవస్థలు పడుతున్నాం. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. - కాలనీవాసులు, తిర్మన్‌పల్లి

● ప్రస్తుతం పనిచేస్తున్న వాటర్‌మెన్‌తో ఇబ్బందులు వస్తున్నాయి. అక్టోబరులో కొత్త వాటర్‌మెన్‌ను నియమించి సమస్య లేకుండా నీరందిస్తాం. - శ్రీధర్, పంచాయతీ కార్యదర్శి, తిర్మన్‌పల్లి

● నవీపేట ప్రయాణ ప్రాంగణ ఆవరణలో మురుగు నిలిచింది. - నర్సయ్య, గ్రామస్థుడు, నవీపేట

● ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. - రవీంద్రనాయక్, కార్యదర్శి, నవీపేట

● ఖలీల్‌వాడిలో లీకేజీ మరమ్మతుల కోసం గుంత తవ్వి వదిలేశారు. అసలే రోడ్డు ఇరుకు. ఆసుపత్రులకు వెళ్లేవారు రోడ్డుపైనే వాహనాలు నిలుపుతుండటంతో ట్రాఫిక్ ఇబ్బందులవుతున్నాయి. - నాగరాజు, ఖలీల్‌వాడి

● త్వరలో గుంత పూడ్చేయించి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూస్తాం. - పావని, ఏఈ

- న్యూస్‌టుడే, నిజామాబాద్ అర్బన్ ఎడపల్లి, రుద్రూర్, ఇందల్‌వాయి, బోధన్ పట్టణం, నవీపేట, నిజామాబాద్ నగరం

మొక్కలు నాటి కానుకగా ఇవ్వాలి

నిజామాబాద్ నేరవిభాగం: ప్రతి ఒక్కరు మొక్కలు నాటి తమ పిల్లలకు కానుకగా ఇవ్వాలని నిజామాబాద్ సీపీ కల్మేశ్వర్ తెలిపారు. నిజామాబాద్ పోలీసు కమిషనర్ కార్యాలయంలో గురువారం వనమహోత్సవం నిర్వహించారు. మొక్కలు నాటితే వాతావరణాన్ని సమతౌల్యం చేసినవారమౌతామని పేర్కొన్నారు. అదనపు డీసీపీలు కోటేశ్వర్‌రావు, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటిన సీపీ కల్మేశ్వర్, అదనపు డీసీపీలు కోటేశ్వర్‌రావు, శంకర్‌నాయక్

'రాహుల్‌గాంధీ వ్యాఖ్యలు సరికాదు'

నిజామాబాద్ నగరం, న్యూస్‌టుడే: రాహుల్ గాంధీ వ్యాఖ్యలు దేశ భద్రతకు భంగం వాటిల్లేలా ఉన్నాయిని ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. గురువారం భాజపా జిల్లా కార్యలయంలో ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తదితరులు ఉన్నారు. సమావేశానికి తమను ఎందుకు ఆహ్వానించలేదని కార్పొరేటర్లు సాయివర్ధన్, ఉమారాణి, రాఘవేందర్ ఎస్సీమోర్చా జిల్లా అధ్యక్షుడిని ప్రశ్నించారు. గాజుల్‌పేట్‌లోని సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం వినాయక్ నగర్ వద్ద ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

కొనసాగిన ఉచిత వైద్యపరీక్షలు

నిజామాబాద్ నగరం, న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా నగరపాలక సంస్థ సిబ్బందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. రెండో రోజైన గురువారం జిల్లా కేంద్రంలో న్యూ అంబేడ్కర్ భవనంలో నగరపాలక సంస్థ సిబ్బందికి ఉచితంగా రక్తపరీక్షలు, వైద్య పరీక్షలు నిర్వహించారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, నగరపాలక సంస్థ కమిషనర్ మకరందు శిబిరాన్ని పరిశీలించారు.

నేడు యువ టూరిజం క్లబ్ సమావేశం

నిజామాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం గిరిరాజ్ కళాశాలలో విద్యార్థులతో ఏర్పాటు చేస్తున్న యువ టూరిజం క్లబ్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ రామ్మోహన్‌రెడ్డి, సమన్వయకర్త దస్తప్ప ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పర్యాటక కేంద్రాల విశేషాలు, వాటి పరిరక్షణ వంటి అంశాలపై పీపీటీ ప్రదర్శన ఉంటుందన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

ఖలీల్‌వాడి, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లోని పారిశుద్ధ్య కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ పేర్కొన్నారు. గురువారం కార్మిక శాఖ అధికారిని కలిసి వినతి పత్రం అందజేశారు. పీఎఫ్, ఈఎస్ఐ, గుర్తింపు కార్డులు అందించాలన్నారు. వారాంతపు, పండగ సెలవులు అమలు చేయాలని పేర్కొన్నారు. అలకానంద, నవనీత, లక్ష్మి, పద్మ, రమ తదితరులు పాల్గొన్నారు.



కార్మికశాఖ అధికారికి వినతి పత్రం ఇస్తున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్

వీరనారి ఐలమ్మకు నివాళి

జిల్లా వ్యాప్తంగా గురువారం చాకలి ఐలమ్మ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించి సేవలను కొనియాడారు. -న్యూస్‌టుడే బృందం



ఇందల్‌వాయిలో..



నగరంలోని వినాయక్‌నగర్‌లో అదనపు పాలనాధికారి కిరణ్ కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేష్ తదితరులు



ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అదనపు డీసీపీ(అడ్మిన్) కోటేశ్వర్‌రావు



భారాస నేతల ఆధ్వర్యంలో..



బోధన్ ఆర్డీవో కార్యాలయంలో..



గిరిరాజ్ కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ రామ్మోహన్‌రెడ్డి, అధ్యాపకులు రాజేశ్

179 మంది హాజరు

బోధన్ పట్టణం, న్యూస్‌టుడే: బోధన్ డివిజన్ పరిధిలోని రేషన్ డీలర్ల భర్తీకి గురువారం చేపట్టిన నియామక పరీక్షకు 179 హాజరయ్యారు. సబ్ కలెక్టర్ వికాస్ మహతో పర్యవేక్షణలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో పరీక్ష నిర్వహించారు.

జాతీయ లోక్ అదాలత్‌కు ఏర్పాట్లు పూర్తి

నిజామాబాద్ న్యాయవిభాగం న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు జిల్లా న్యాయసేవా సంస్థ పర్యవేక్షకులు పురుషోత్తంగౌడ్ తెలిపారు. నిజామాబాద్‌లో 6, బోధన్‌లో 4, ఆర్మూర్‌లో 2 చొప్పున బెంచ్‌లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

ఈరవత్రి అనిల్ జన్మదిన వేడుకలు

ఖలీల్‌వాడి, నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: కొండా లక్ష్మణ్ బాపూజీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ ఛైర్మన్ ఈరవత్రి అనిల్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. దత్తాత్రి, భక్తవత్సలం కేకు కోశారు. గంగరాజు, రాజేందర్ పాల్గొన్నారు. నగర పద్మశాలీ సంఘం అధ్యక్షుడు వెంకట నర్సయ్య ఆధ్వర్యంలోనూ వేడుకలు నిర్వహించారు. ప్రధాన కార్యదర్శి మురళి, తెలంగాణ చేనేత ఐక్య వేదిక రాష్ట్ర కోశాధికారి సిలివేరి గణేశ్ ఉన్నారు. జిల్లా కాంగ్రెస్ భవన్‌లో ఎన్ఎస్‌యూఐ, కాంగ్రెస్ సేవాదళ్ ఆధ్వర్యంలో కేకు కోసి వేడుకలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు వేణురాజ్ తదితరులు ఉన్నారు.



కేక్ కోస్తున్న భక్తవత్సలం, పద్మశాలీ నాయకులు

కొండాలక్ష్మణ్ బాటలో నడవాలి

నిజామాబాద్ సాంస్కృతికం: తెలంగాణ స్వాతంత్ర్య సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను గురువారం నగరంలోని సరస్వతీనగర్ సంస్థ కార్యాలయంలో నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సంస్థ అధ్యక్షుడు దయానంద్, బ్రహ్మయ్య, ప్రకాశ్‌గౌడ్, గురువారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా ఊర పండుగ

డిచ్‌పల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: నడిపల్లి గ్రామంలో గురువారం ఊర పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. వీడీసీ అధ్యక్షుడు అశోక్, ఉపాధ్యక్షుడు గంగాధర్, సభ్యులు, కుల సంఘాల పెద్దలు, యువకులు పాల్గొన్నారు.



నడిపల్లిలో పండుగకు హాజరైన గ్రామస్థులు

విద్యావేత్తలకు అవకాశం ఇవ్వండి

ఖలీల్‌వాడి, న్యూస్‌టుడే: రాజకీయాల్లోకి చదువుకున్న మేధావులు, విద్యావేత్తలకు అవకాశం ఇస్తే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ పరిధిలో జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. అర్హులైన పట్టభద్రులు తప్పని సరిగా ఓటు నమోదు చేయించుకొని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

నిజామాబాద్ అర్బన్: మరమ్మతులు చేసే సమయంలో సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్తు శాఖ సీఈ అశోక్ తెలిపారు. నిజామాబాద్ పవర్ హౌస్‌లో కామారెడ్డి జిల్లాకు చెందిన సిబ్బందికి నియంత్రికల మరమ్మతులు, నిర్వహణపై హైదరాబాద్‌కు చెందిన పవర్ ఎలక్ట్రికల్స్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఒక రోజు శిక్షణ ఇచ్చారు. టీజీఎస్పీడీసీఎల్ కామారెడ్డి జిల్లా ఎస్ఈ రమేష్‌బాబు, డీఈ నాగరాజు, ఏడీఈ చంద్రకాంత్, ఏఈలు స్వప్న, దేవిదాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విద్యుత్తు శాఖ సీఈ అశోక్

సమస్యలపై తీర్మానాలు

బోధన్ గ్రామీణం, పొతంగల్, నవీపేట, ఎడపల్లి, సిరికొండ, మోపాల్ న్యూస్‌టుడే: వరికోతలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ధాన్యం ఆరబెట్టు యంత్రాల కొనుగోలుకు బోధన్ ప్రాథమిక సహకార సంఘం ఏకగ్రీవంగా తీర్మానించింది. గురువారం ఉపాధ్యక్షుడు వీరభద్రరావు, అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. పొతంగల్ సహకార సంఘం నష్టాల ఊబిలో కూరుకుపోవడానికి పాలకవర్గమే బాధ్యత వహించాలని విండో సభ్యులు డిమాండ్ చేశారు. నవీపేటలో రూ.2 లక్షల లోపు రుణమాఫీ పొందని రైతులకు రుణమాఫీ చేయాలని నవీపేట సహకారా సంఘం సభ్యులు తీర్మానించారు. జానకంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మహాజన సభను ఛైర్మన్ నరేందర్ అధ్యక్షతన నిర్వహించారు. డీసీసీబీ ఛైర్మన్ కుంట రమేష్ పాల్గొన్నారు. మోపాల్ సొసైటీ ఛైర్మన్ గ్యానాజి గంగారెడ్డి అధ్యక్షతన మహాజన సభ నిర్వహించారు. సిరికొండలోని తూంపల్లి సహకార సంఘంలో నిర్వహించిన మహాజన సభ వాడీవేడిగా సాగింది. సొసైటీలో 32 మంది రైతులకు సీఈవో నిర్లక్ష్యంతో రుణమాఫీ కాలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సొసైటీలో లెక్కల్లో అవకతవకలపై సీఈవోను రైతులు నిలదీశారు.

సీఐల బదిలీలు

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: నిజామాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో సీఐలు బదిలీ చేస్తూ సీపీ కల్మేశ్వర్ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. నిజామాబాద్ సీసీఆర్‌బీలో పనిచేస్తున్న శ్రీనివాస్‌రాజ్‌ను టౌన్ సర్కిల్‌కు బదిలీ చేయగా, అక్కడ ఉన్న సీఐ నరహరిని హైదరాబాద్‌లోని ఐజీ కార్యాలయానికి బదిలీ చేశారు. హైదరాబాద్ ఐజీ కార్యాలయంలో వెయిటింగ్‌లో ఉన్న రఘుపతిని నిజామాబాద్ ఒకటో ఠాణా ఎస్‌హెచ్‌వోగా, అక్కడ విధులు నిర్వహిస్తున్న విజయ్‌బాబును బోధన్ రూరల్ సర్కిల్‌కు, బోధన్ రూరల్ సర్కిల్‌లో సీఐగా పనిచేస్తున్న కోల నరేశ్‌కుమార్‌ను హైదరాబాద్ ఐజీ కార్యాలయానికి కేటాయించారు.

గురుకులాల్లోని సమస్యలు పరిష్కరించండి

డిచ్‌పల్లి గ్రామీణం: డిచ్‌పల్లి మండలం ధర్మారం, సుద్దపల్లి బాలికల గురుకుల పాఠశాల్లో విద్యార్థులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, అధికారులు వెంటనే వాటిని పరిష్కరించాలని ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మహిపాల్ డిమాండ్ చేశారు. రెండు హాస్టళ్లలోని సమస్యలను తెలుసుకున్న అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టడం లేదని ఆరోపించారు.

పంచాయతీ కార్యదర్శుల నిరసన

ధర్పల్లి: నల్లగొండ జిల్లాలో ఎంపీడీవోను, ఇద్దరు కార్యదర్శులను అకారణంగా సస్పెండ్ చేశారని నిరసిస్తూ ధర్పల్లి మండల పరిషత్తు కార్యాలయం ఎదుట ఎంపీడీవో బాలకృష్ణ కార్యదర్శులు గురువారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఇన్‌ఛార్జి ఎంపీవో భాస్కర్, పంచాయతీ కార్యదర్శుల జిల్లా అధ్యక్షుడు సుమన్ పాల్గొన్నారు.

చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయండి

డిచ్‌పల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఈ నెల 30న తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కార్మిక నాయకులు జేపీ గంగాధర్ కోరారు. ధర్నాకు సంబంధించిన గోడ ప్రతులను గురువారం డిచ్‌పల్లిలో ఆవిష్కరించి మాట్లాడారు. అంతకుముందు పంచాయతీల్లో పనిచేసే కార్మికుల పెండింగ్ వేతనలు చెల్లించాలని డిచ్‌పల్లి ఎంపీడీవో రవీందర్‌కు ఐఎఫ్‌టీయూ, ప్రగతిశీల పంచాయతీ వర్కర్స్ యూనియన్ సంయుక్తంగా వినతిపత్రం అందించాయి. నాయకులు సాయినాథ్ తదితరులున్నారు.

విద్యుత్తు అధికారుల పొలం బాట



డిచ్‌పల్లి గ్రామీణం: డిచ్‌పల్లి మండలం అమృతాపూర్ గ్రామంలో గురువారం పొలం బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఈ ఉత్తమ్‌కుమార్, ఏఈ రాజేందర్ క్షేత్రస్థాయిలో బోరు మోటార్లు పరిశీలించి రైతుల ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. వీడీసీ సభ్యులు ధర్మయ్య, గంగాధర్‌గౌడ్ ఉన్నారు.

రేషన్ డీలర్ల పోస్టుల భర్తీకి రాత పరీక్ష నేడు

నిజామాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: నిజామాబాద్ డివిజన్‌లో ఖాళీగా ఉన్న రేషన్ డీలర్ల పోస్టుల భర్తీకి శుక్రవారం రాత పరీక్ష నిర్వహిస్తున్నారు. రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో ఉదయం 10.30 నుంచి 1 వరకు ఉంటుంది. డిచ్‌పల్లి, ధర్పల్లి, ఇందల్‌వాయి, మోపాల్, నిజామాబాద్ గ్రామీణం, దక్షిణం, ఉత్తరం, సిరికొండ, నవీపేట, మాక్లూర్ మండలాల్లో 38 డీలర్ల పోస్టులు ఉండగా 418 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో ఉత్తీర్ణులైన వారికి ముఖాముఖి నిర్వహించి ఎంపిక చేయనున్నారు.

వరిపంట పరిశీలన

రెంజల్(ఎడపల్లి), న్యూస్‌టుడే: సాటాపూర్ శివారులోని వరిపంటను బోధన్ ఏడీఏ, ఎంఏ. అలీం గురువారం పరిశీలించి సూచనలు చేశారు. ఏవో లక్ష్మీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల విక్రయాలు నిలిపివేత

రెంజల్(ఎడపల్లి), న్యూస్‌టుడే: సాటాపూర్‌లోని రెంజల్ సొసైటీ ఎరువుల దుకాణంలో విక్రయాలు నిలిపివేయాలని వ్యవసాయ శాఖ అధికారులు సిబ్బందికి గురువారం నోటీసులు జారీ చేశారు. ఈపాస్ యంత్రం లేకుండా ఎరువులు విక్రయిస్తుండటంతో అభ్యంతరం తెలిపారు.

ఎట్టకేలకు కుటుంబ సభ్యుల చెంతకు

అమీర్‌పేట, న్యూస్‌టుడే: ఎర్రగడ్డలోని మానసిక చికిత్సాలయంలో 9 ఏళ్లుగా చికిత్స పొందుతూ కోలుకున్న బాధితురాలిని గురువారం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. అనిత తెలిపారు. నిజామాబాద్‌కు చెందిన ఓ మహిళ(50) మానసిక వ్యాధితో 2017లో ఆసుపత్రిలో చేరారు. నిబంధనల ప్రకారం.. రోగి ఆరోగ్యం కుదుటపడగానే ఒకటి, రెండేళ్లలోపు కుటుంబ సభ్యులకు అప్పగిస్తారు. కానీ ఈ మహిళ విషయంలో ఆసుపత్రి నుంచి తీసుకెళ్లడానికి సుముఖత చూపలేదు. ఆసుపత్రి అధికారులు ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించలేదు. విషయాన్ని ఆసుపత్రి న్యాయ సలహాదారు సి.మంజుల గౌర్ దృష్టికి తీసుకెళ్లగా.. ఆమె కుటుంబ సభ్యులతో మాట్లాడి నచ్చజెప్పారు. దీంతో బాధితురాలి భర్త, తండ్రి గురువారం వచ్చి ఆమెను ఇంటికి తీసుకెళ్లారు.

గొలుసు చోరీకి యత్నం

బోధన్ గ్రామీణం: బోధన్ కొత్త బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న ఓ మహిళ మెడలోంచి బంగారు గొలుసు చోరీకి యత్నించిన మహారాష్ట్రకు చెందిన ఇద్దరు మహిళల్ని స్థానికులు పట్టుకున్నారు. ఈ ఘటనపై పోలీసులు విచారిస్తున్నారు.


మహిళ అదృశ్యం

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: నాలుగో ఠాణా పరిధిలో మహిళ అదృశ్యం కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం.. నగరంలోని ఎల్లమ్మగుట్టకు చెందిన అట్లగట్ల లక్ష్మి(59) ఈ నెల 20న ఇంట్లో గొడవపడి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టు పక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. ఆమె కొడుకు ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో శ్రీకాంత్ తెలిపారు.

పట్టాలపైకి రావొద్దంటే.. రాళ్లతో వీరంగం

☛ మాధవనగర్ రైల్వే గేటు వద్ద ఘటన

డిచ్‌పల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: తాగిన మత్తులో ఒక యువకుడు ఆత్మహత్య చేసుకోవడానికి మాధవనగర్ రైల్వేగేటు వద్దకు వచ్చి నానా వీరంగం సృష్టించాడు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. గుర్తుతెలియని యువకుడు తాగిన మత్తులో రైల్వే పట్టాలపైకి వస్తుండటాన్ని గమనించిన రైల్వే గేట్‌మెన్, స్థానికులు రావొద్దని వారించగా.. వాళ్లపై రాళ్లు విసిరాడు. పట్టాలపై రాళ్లు పెట్టాడు. పోలీసులకు ఫిర్యాదు చేస్తామని అనడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. ఘటనా స్థలానికి నిజామాబాద్ రైల్వే ఎస్సై సాయిరెడ్డి సిబ్బందిని పంపి విచారణ చేయించారు. యువకుడి కోసం గాలింపు చేపట్టినట్లు పేర్కొన్నారు.



క్రీడాకారులకు అభినందన



విద్యార్థులతో ప్రధానోపాధ్యాయురాలు హరిత, వీడీసీ ప్రతినిధులు

ఆర్మూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాస్థాయి డి. శ్రీనివాస్ మెమోరియల్ బాలబాలికల వాలీబాల్ పోటీల్లో ఆర్మూర్ మండలం మగ్గిడి జడ్పీహెచ్ఎస్ క్రీడాకారులు సత్తాచాటారు. నిజామాబాద్‌లో ఇటీవల జరిగిన పోటీల్లో బాలబాలికల జట్లు విజేతలుగా నిలిచాయి. ఒక్కో జట్టు ట్రోఫీతో పాటు రూ.10 వేల నగదు గెలుచుకున్నాయి. క్రీడాకారులను ప్రధానోపాధ్యాయురాలు హరిత, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు గురువారం అభినందించారు.

ఆర్మూర్

• ఆర్మూర్ • బాల్కొండ

నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన

శ్రీరామసాగర్, న్యూస్‌టుడే: శ్రీరామసాగర్ ప్రాజెక్టు జల విద్యుత్తు ఉత్పాదన కేంద్రంలో ఉద్యోగులు గురువారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. రామగుండంలో నూతనంగా నిర్మించనున్న థర్మల్ విద్యుత్తు ఉత్పాదన కేంద్రాన్ని జెన్‌కో ఆధ్వర్యంలో నిర్వహించాలని డిమాండ్ చేశారు. నాయకులు రఫీక్, సతీష్, భరత్‌ల ఆధ్వర్యంలో ఉద్యోగులు ఆందోళనలో పాల్గొన్నారు. శ్రీనివాస్, సురేష్‌కుమార్, వేణుగోపాల్, నితిన్‌సింగ్, ప్రవీణ్, మంజుల, మమత, స్వాతి, హేమలత తదితరులు పాల్గొన్నారు.



జల విద్యుత్తు ఉత్పాదన కేంద్రంలో..

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్) — ఈనాడు సినిమాలు

స్క్రీన్ 1 దేవర(పార్ట్-I): 9.30, 4.05, 10.40
మత్తు వదలరా-2 : 1.05, 7.40
స్క్రీన్ 2 దేవర(పార్ట్-I): 8.00, 11.35, 3.10, 6.45, 10.20
స్క్రీన్ 3 దేవర(పార్ట్-I) : 7.40, 11.15, 2.50, 6.25, 10.00
స్క్రీన్ 4 దేవర(పార్ట్-I): 8.40, 12.15, 3.50, 7.25, 11.00

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే

మేమున్నాం.. మీకు తోడుగా..

94939 26837
98666 11160

వీధి దీపాలు వెలిగాయి



మాక్లూర్(గ్రామీణం): మాక్లూర్ మండలం సట్లాపూర్ తండాలో వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా' దృష్టికి తీసుకొచ్చారు. సమస్య 'ఈనాడు' ప్రచురితం కావడంతో ఎంపీవో శ్రీనివాస్ స్పందించి వీధీ దీపాలు పెట్టించారు.

తీగలు సరిచేశారు

స్పందనకు వందనం

నందిపేట్: కుద్వాన్‌పూర్‌లో తరచూ విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడడంపై స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' తీసుకురాగా గురువారం 'ఈనాడు'లో సమస్య ప్రచురితమైంది. స్పందించిన లైన్ ఇన్‌స్పెక్టర్ మోతిలాల్ గ్రామంలో విద్యుత్తు తీగలు పరిశీలించి సరిచేయించారు.

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని మామిడిపల్లి ప్రభుత్వ పాఠశాల వద్ద వ్యర్థాలు పేరుకున్నట్లు స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా'కు సమాచారం ఇచ్చారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో గురువారం సమస్యను పరిష్కరించారు.

పంటలు చూసి.. సూచనలు చేసి



నందిపేట్: నూత్‌పల్లిలో వరి పంట తెగుళ్ల బారిన పడడంతో వ్యవసాయాధికారులు వచ్చి సూచనలు చేస్తే బాగుంటుందని రైతులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తీసుకురాగా.. 'ఈనాడు'లో గురువారం సమస్య ప్రచురితమైంది. మండల వ్యవసాయ అధికారిణి జ్యోత్స్న స్పందించి ఏఈవో అనూషను క్షేత్రస్థాయికి పంపించి రైతులకు సూచనలు అందించేలా చర్యలు తీసుకున్నారు.

సమస్య: మాక్లూర్ మండలం అమ్రాద్ గ్రామంలో మురుగు కాలువలు శుభ్రం చేయడం లేదు. **- రవి, అమ్రాద్**

సమాధానం: మురుగు కాలువలను శుభ్రం చేయిస్తాం. **- చంద్రశేఖర్, కార్యదర్శి**

సమస్య: మాక్లూర్ మండలం ఒడ్యాట్‌పల్లి రైల్వే కమాన్ వద్ద పెద్ద గుంత ఏర్పడింది. **- చిరంజీవి, ఒడ్యాట్‌పల్లి**

సమాధానం: గుంతను పూడ్చేలా చర్యలు తీసుకుంటాం. **- గులాబ్‌సింగ్, ఆర్‌అండ్‌బీ ఏఈ**

సమస్య: బడాభీమ్‌గల్ కేసీఆర్ కాలనీలో చెత్త సేకరణకు పంచాయతీ ట్రాక్టర్ సరిగ్గా రావడం లేదు. **- స్థానికులు**

సమాధానం: చెత్త సేకరించేలా చర్యలు చేపడతాం - **రజిత, పంచాయతీ కార్యదర్శి**

సమస్య: చేంగల్ ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ హాల్ దగ్గర చెట్ల కొమ్మలు విద్యుత్తు తీగలకు తాకి వర్షం కురుస్తున్న సమయంలో మెరుపులు వస్తున్నాయి. **- స్థానికులు**

సమాధానం: సమస్య మా దృష్టికి వచ్చింది. త్వరలో సిబ్బందితో కొమ్మలు తొలగించి వేయిస్తాం. **- ప్రదీప్ పంచాయతీ కార్యదర్శి**

సమస్య: నందిపేట్ రాజ్‌నగర్‌లో వీధి దీపాలు పనిచేయడం లేదు. కుక్కల బెడద కూడా ఎక్కువవుతుంది. **- సాయిలు**

సమాధానం: వీధి దీపాలు పనిచేయని చోట వెంటనే కొత్తవి ఏర్పాటు చేస్తాం. కుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకుంటాం. **- లక్ష్మీప్రసాద్, ఎంపీవో, నందిపేట్**

సమస్య: నందిపేట్ వెంకటేశ్వర కాలనీలో మురుగు కాలువలను సక్రమంగా శుభ్రం చేయడం లేదు. **- నర్సయ్య, నందిపేట్**

సమాధానం: పంచాయతీ సిబ్బందిని కాలనీల్లో పర్యటించి సమస్యలను తెలుసుకోవాలని సూచిస్తాం. అన్ని కాలనీల్లో మురుగు కాలువలను శుభ్రం చేయిస్తాం.

- లక్ష్మీప్రసాద్, ఎంపీవో, నందిపేట్

– న్యూస్‌టుడే, మాక్లూర్ గ్రామీణం, భీమ్‌గల్ గ్రామీణం, నందిపేట్

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

ఏర్గట్ల, న్యూస్‌టుడే: ఎంపీడీవో వెంకటేశ్వర్లు అధ్యక్షతన మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను గురువారం సన్మానించారు. ఏర్గట్ల, కమ్మర్‌పల్లి ఎంఈవోలు ఆనంద్‌రావు, ఆంధ్రయ్య, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు కృష్ణాచారి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.







ఆలూర్ మండల కేంద్రానికి చెందిన నితీష్ నిజామాబాద్ నుంచి ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వెళ్లే సమయంలో మాక్లూర్ మండలం అడవి మామిడిపల్లి ఆర్వోబీ వద్ద పెద్ద గుంతలో పడిపోయి చేయి విరిగింది. స్థానికులు ఆయనను చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు.

ఈ నెల 14వ తేదీన ఆర్వోబీ వంతెన వద్ద రైల్వే గేటు దగ్గర రెండు లారీలు మరమ్మతులకు గురవడంతో మూడు గంటల పాటు రాకపోకలు స్తంభించిపోయాయి. ఓ లారీని వెనకాల వస్తున్న కారు ఢీకొట్టగా ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి.

పనులు కదలవు.. ప్రయాణం సాగదు

ఆరేళ్లయినా పూర్తికాని మామిడిపల్లి ఆర్వోబీ నిర్మాణం

న్యూస్‌టుడే, మాక్లూర్ గ్రామీణం

63వ జాతీయ రహదారిపై నుంచి నాగ్‌పూర్, మహారాష్ట్ర, కరీంనగర్, వరంగల్, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలకు నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. ఆర్టీసీకీ అధిక ఆదాయం తీసుకువచ్చే మార్గం ఇది. కానీ అడవి మామిడిపల్లి వద్ద ఆర్వోబీ పనులకు రూ.15.9 కోట్లు మంజూరయ్యాయి. నిధుల సమస్య లేనప్పటికీ గుత్తేదారు నిర్లక్ష్యంతోనే పనులు జరగటం లేదని అధికారులు చెబుతున్నారు. రైల్వే గేటు వద్ద నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది.

మొరం లేదనే సాకు..

ఆర్వోబీ పనులు పూర్తికాకపోవటానికి ప్రధానం కారణం మొరం లేదని అధికారులు, గుత్తేదారులు చెబుతున్నారు. మామిడిపల్లి దగ్గర్లోనే గుట్టలు ఉన్నాయి. మొరం సమస్య లేదని స్థానికులు చెబుతున్నారు. ప్రజాప్రతినిధులు, ప్రజలు ప్రశ్నించిన సమయాల్లో రెండు రోజులు పనులు చేసి.. రెండు నెలలు ఆపేస్తున్నారు.

అది 63వ నంబరు జాతీయ రహదారి. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించేమార్గం. అంత వరకు సాఫీగా సాగిన ప్రయాణం.. మాక్లూర్ మండలం అడవి మామిడిపల్లి ఆర్వోబీ(రైల్వే పైవంతెన) వద్దకు రాగానే ప్రయాణికులు భయపడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ.. గుత్తేదారు నిర్లక్ష్యంతో ఆరేళ్లుగా ఆర్వోబీ పనులు కొనసాగుతూనే ఉన్నాయి. ఫలితంగా వంతెనకు ఇరువైపులా భారీ గోతులతో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి.

నరకయాతన చూస్తున్నాం

- మల్లారెడ్డి, మామిడిపల్లి

మామిడిపల్లి ఆర్వోబీ వద్ద అర కి.మీ ప్రయాణం చేయాలంటే నరకం కనిపిస్తోంది. గుంతలతో ప్రమాదాలు జరుగుతుండగా.. మరోవైపు వాహనాలు దెబ్బతింటున్నాయి. ప్రయాణం మాత్రం నరకానికి వెళ్లినట్లే అనిపిస్తుంది.

డిసెంబరు వరకు అందుబాటులోకి..

- మల్లారెడ్డి ఆర్‌అండ్‌బీ, డీఈఈ

పనుల్లో వేగం పెంచాం. నిధుల సమస్య లేదు. త్వరగా పూర్తిచేయాలని గుత్తేదారుని ఆదేశించాం. త్వరితగతిన పూర్తి చేసి డిసెంబరు వరకు అందుబాటులోకి తీసుకొస్తాం.

22 గేట్లెత్తి.. గోదావరిలోకి వదిలి

శ్రీరామసాగర్ ప్రాజెక్టులోకి వరద చేరిక పెరిగింది. పూర్తిస్థాయిలో 1091 అడుగులు, 80.501 టీఎంసీల నీరు నిల్వ చేస్తూ మిగులు జలాలు దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టులోకి గురువారం ఉదయం 45,734 క్యూసెక్కుల వరద చేరగా ఆరు వరద గేట్ల ద్వారా 18,744 క్యూసెక్కులు దిగువకు విడుదల చేశారు. సాయంత్రానికి వరద చేరిక 1,09,214 క్యూసెక్కులకు పెరగడంతో ప్రాజెక్టు 22 వరద గేట్లను ఎత్తి 81,224 క్యూసెక్కులు గోదావరి నదిలోకి విడుదల చేస్తున్నారు. వరద కాల్వ ద్వారా 19000, కాకతీయ కాల్వకు 6800, ఎస్కేప్ గేట్లు 1200, లక్ష్మి కాల్వకు 50, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు వదులుతున్నారు.

– న్యూస్‌టుడే, శ్రీరామసాగర్



వెనకజలాలొచ్చె.. పంటలను ముంచెత్తె



ఆయిల్‌పామ్ తోటలో..



పసుపు పొలంలో..

శ్రీరామసాగర్ ప్రాజెక్టులోకి వరద కొనసాగుతుండడంతో జలాశయం జలకళ సంతరించుకుంది. ప్రాజెక్టు వెనుక వైపునున్న జలాల్‌పూర్ తదితర గ్రామాల్లో గోదావరి తీరం సమీపంలోని పంట పొలాల్లోకి గురువారం నీరు చేరింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పసుపు, సోయాబీన్, ఆయిల్‌పామ్ తదితర పంటలకు నీటితో ముప్పు పొంచి ఉందని పేర్కొన్నారు. పంటలకు నష్టం కలుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. నష్టపోతే పరిహారం ఇవ్వాలని వేడుకుంటున్నారు.

– న్యూస్‌టుడే, బాల్కొండ

సాగు విధానాల పరిశీలన

ఆర్మూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: రాజన్న సిరిసిల్ల జిల్లా కోనారావుపేట మండలం మామిడిపల్లి గ్రామ ఆదర్శ పరస్పర సహకార సంఘం రైతులు ఆర్మూర్ మండలం అంకాపూర్‌లోని పంట క్షేత్రాలను గురువారం సందర్శించారు. పసుపు, మొక్కజొన్న, వేరుసెనగ, వరి పంటలు పరిశీలించారు. ఇక్కడి సాగు విధానాలు, మెలకువలు తెలుసుకున్నారు. సేంద్రియ ఎరువులు వాడకం, బిందుసేద్య పద్ధతిలో పండిస్తున్నామని స్థానిక రైతులు వివరించారు. కార్యక్రమంలో గురడిరెడ్డి సంఘం అధ్యక్షుడు చిన్న అనంతు, కార్యదర్శి ఆలూర్ నారాయణరెడ్డి, కె.కె.భాజన్న, రైతులు దీవరావు, రమేష్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పసుపు పంట పరిశీలిస్తున్న సిరిసిల్ల రైతులు

పిల్లలను క్రీడల్లో ప్రోత్సహించాలి



క్రీడాజ్యోతి ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

కమ్మర్‌పల్లి, న్యూస్‌టుడే: తల్లిదండ్రులు పిల్లలను చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రోత్సహించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. కమ్మర్‌పల్లిలో గ్రామాభివృద్ధి కమిటీ, విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల అంతర్ పాఠశాలల క్రీడోత్సవాలను ఆయన గురువారం ప్రారంభించారు. గెలుపోటములను సమానంగా స్వీకరించి.. క్రీడాస్ఫూర్తి చాటాలన్నారు. క్రీడల నిర్వహణతో గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల నైపుణ్యాలు వెలుగులోకి వస్తాయన్నారు. పాఠశాలలకు దాత దయానంద్‌రెడ్డి అందిస్తున్న దాతృత్వాన్ని కొనియాడారు. మార్చ్‌ఫాస్ట్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో కమ్మర్‌పల్లి, చౌట్‌పల్లి, బషీరాబాద్, ప్రైవేటు పాఠశాలల్లో శ్రీవిద్యాసాయి, విజ్ఞానజ్యోతి, మిసిమి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు. క్రీడల ఛైర్మన్ సాయన్న, తహసీల్దార్ అంజనేయులు, ఎంపీడీవో రాజశ్రీనివాసు, వీడీసీ అధ్యక్షుడు రామస్వామి పాల్గొన్నారు.

సేవలు విస్తృతం చేయాలి

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ సేవలను మరింతగా విస్తృతం చేయాలని గవర్నర్ శరత్ చౌదరి అన్నారు. గురువారం ఆర్మూర్ పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచంలో పోలియో నిర్మూలనకు రోటరీ ఎంతగానో కృషి చేసిందన్నారు. సేవా కార్యక్రమాలతో పాటు మెగా వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు రజనీష్ కిరాడ్, ప్రధాన కార్యదర్శి ఆనంద్, కోశాధికారి శశిధర్, పాస్ట్ గవర్నర్ హనుమంత్‌రెడ్డి, జ్ఞాని ప్రకాశ్, విశాఖ గంగారెడ్డి, చరణ్‌రెడ్డి, పుష్పాకర్, లక్ష్మీనర్సయ్య, గోపికృష్ణ, తులసీకుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రోటరీ గవర్నర్ శరత్ చౌదరి

నగదు బహుమతుల అందజేత

ఆర్మూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: మాజీ ఎమ్మెల్యే గడ్డం మధుసూదన్‌రెడ్డి జ్ఞాపకార్థం పట్టణంలోని పెర్కిట్ జడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. మధుసూదన్‌రెడ్డి జయంతిని పురస్కరించుకొని గురువారం ఆయన కుమారుడు న్యాయవాది గడ్డం మహేందర్‌రెడ్డి దంపతులు పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందిన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, అమ్మ ఆదర్శ పాఠశాల ఛైర్మన్ పర్వీన్, పెర్కిట్, కొటార్మూర్ ప్రతినిధులు దేవేందర్, సత్యం, నాగరాజు, గంగాధర్, రాజబాబు, బుచ్చన్న, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



సీసీ కెమెరాల ఏర్పాటు



మాక్లూర్, న్యూస్‌టుడే: కొత్తపల్లిలోని పోచమ్మ గుడిలో రూ.25వేల వ్యయంతో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలను ఎస్సై రాజశేఖర్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులను అభినందించారు. సీసీ కెమెరాల ప్రాముఖ్యం వివరించారు. నాయకులు భరత్, దామోదర్‌రావు, విఠల్, శివరామకృష్ణ, సీతారామయ్య, మురళి, రాంబాబు, ప్రసాద్, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

దొడ్డు వడ్లకు బోనస్ ఇవ్వాలని డిమాండ్

కమ్మర్‌పల్లి: సన్నాలతోపాటు దొడ్డు వడ్లకు రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ఇవ్వాలని అఖిల భారతీయ రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్ అన్నారు. కమ్మర్‌పల్లిలో గురువారం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో వరికి రూ.500 బోనస్ ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు సన్నాలకే ఇస్తామని ప్రకటించడం అన్యాయమన్నారు. రూ.2 లక్షల రుణమాఫీపై సర్వే చేసి ఇప్పటికీ తేల్చకపోవడం శోచనీయమన్నారు. బాలయ్య, సత్తెక్క, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అవీ...ఇవీ.. అన్నీ

అనిల్ జన్మదిన వేడుకలు



బాల్కొండలో రక్తదాన శిబిరం

బాల్కొండ: బాల్కొండలో రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ ఛైర్మన్ అనిల్‌ఈరవత్రి జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. వేల్పూర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముత్యంరెడ్డి, సంజీవ్ గౌడ్, ఇమ్రాన్‌ఖాన్, కిషన్‌గౌడ్, జావిద్, శ్రీనివాస్, ప్రవీణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి, భీమ్‌గల్, మోర్తాడ్: కమ్మర్‌పల్లిలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సుంకెట రవి కేకు కోశారు. భీమ్‌గల్ పట్టణంలో యువకులు మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటుచేశారు. యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు నాగేంద్రబాబు, అవినాష్, చిన్నారెడ్డి, సతీష్ పాల్గొన్నారు. మోర్తాడ్ ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదానం నిర్వహించి, రోగులకు పండ్లు పంపిణీ చేశారు. సేవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనాథ పిల్లలకు అన్నదానం చేశారు. రాములు, గోపి, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలలను రక్షించాలి

భీమ్‌గల్, న్యూస్‌టుడే: జీవో 25ను రద్దు చేసి ప్రాథమిక పాఠశాలలను రక్షించాలని డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శంతన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భీమ్‌గల్ పట్టణంలో డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ సభ్యత్వ నమోదులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ విధానంతో పేద, మధ్య తరగతి విద్యార్థులను పాఠశాలలకు దూరం చేసినట్లవుతుందన్నారు. భీమ్‌గల్ మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జాన్‌విల్‌సన్, ప్రధాన కార్యదర్శిగా ఈశ్వర్, ఉపాధ్యక్షురాలిగా సంగీత, కార్యదర్శిగా రమేష్‌లు ఎన్నికయ్యారు. డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బాలయ్య, నాయకులు పెంటన్న, దాసు, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు కళాజాత ప్రదర్శన

బాల్కొండ: బాల్కొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలీసు బృందం కళాజాత ప్రదర్శన ఇచ్చారు. ఏఎస్సై శంకర్ మాట్లాడుతూ. విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, ద్విచక్రవాహనాలపై వెళ్లే సమయంలో శిరస్త్రాణం ధరించాలన్నారు. విద్యార్థినులు, మహిళలు ప్రమాదంలో ఉంటే డయల్ 100 లేదా చరవాణి నంబర్ 8712659795లో సంప్రదించాలన్నారు.

చెరువులో నీటమునిగి మృతి

నందిపేట్, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ఊర చెరువులో కన్నయ్య(34) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు నీటమునిగి మృతి చెందాడు. ఎస్సై హరిబాబు కథనం ప్రకారం.. రాజ్‌నగర్‌కు చెందిన కన్నయ్య చెరువులో ఇటీవల నిమజ్జనం చేసి వినాయక విగ్రహాల ఇనుప చువ్వలను తీయడానికి ప్రయత్నిస్తుండగా నీటి మునిగి మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

యువకుడి అదృశ్యం

మాక్లూర్: చిక్లి గ్రామానికి చెందిన వెంకటి ఈ నెల 23న ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు గాలించినా దొరకకపోవడంతో గురువారం పోలీసులను ఆశ్రయించారు. వారి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై రాజశేఖర్ చెప్పారు.

మోర్తాడ్: పాలెం గ్రామానికి చెందిన పురుషోత్తం ఈ నెల 24వ తేదీన అర్ధరాత్రి ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో అతడి భార్య గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదం.. లారీ ధ్వంసం

బాల్కొండ, న్యూస్‌టుడే: బాల్కొండ వద్ద 44వ నంబరు జాతీయ రహదారిపై గురువారం ఉదయం జరిగిన రహదారి ప్రమాదంలో ఒక లారీ ముందు భాగం దెబ్బతినగా ఒకరికి గాయాలయ్యాయి. హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ వెళ్తున్న లారీ ముందు వెళ్తున్న మరో వాహనాన్ని ఢీ కొనడంతో ప్రమాదం చోటుచేసుకుంది. లారీ డ్రైవర్‌కు గాయాలు కాగా.. చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు.



కమ్మర్‌పల్లి పసుపు పరిశోధన స్థానంలో..



కాంగ్రెస్ ఆధ్వర్యంలో



అయిలాపూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో.



ఆర్మూర్ పట్టణం: భాజపా ఆధ్వర్యంలో...

వీరనారి చాకలి ఐలమ్మ

వీరనారి చాకలి ఐలమ్మ అని వక్తలు పేర్కొన్నారు. గురువారం ఐలమ్మ జయంతిని ఆర్మూర్ డివిజన్ వ్యాప్తంగా ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాల ఆధ్వరంలో నిర్వహించారు. ఆమె చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐలమ్మ ఆశయాలను కొనసాగించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. - న్యూస్‌టుడే, యంత్రాంగం



వెల్మల్‌లో..



నందిపేట్ : నివాదాలు చేస్తున్న ప్రతినిధులు



మోర్తాడ్‌లో నివాళులు అర్పిస్తున్న దళిత సంక్షేమ సంఘం నాయకులు



బాల్కొండలో..